## క్లుప్తంగా

### ఆలయాల్లో డీసీపీ ప్రత్యేక పూజలు


స్వామి వారిని దర్శించుకుంటున్న డీసీపీ రామ్‌గోపాల్ నాయక్

పెద్దారవీడు: మండల కేంద్రం త్రిపురాంతకం సమీపంలో వెలసిన శ్రీబాల త్రిపుర సుందరిదేవి, శ్రీపార్వతి త్రిపురాంతకేశ్వర స్వామి వారి ఆలయాలను ఢిల్లీ డీసీపీ రామ్‌గోపాల్ నాయక్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు, స్వామి వారి ఆలయంలో అభిషేకాలు చేశారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనం, ప్రసాదాలు అందించారు.

### ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ


డీఎస్పీతో మాట్లాడేందుకు వచ్చిన బాధితులు

తాళ్లూరు: మండలంలోని చింతలపాలెం ఎస్టీలపై గతంలో జరిగిన దాడికి సంబంధించి జనవరిలో కేసు నమోదైంది. ఈ కేసులో బాధితులు దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణను సోమవారం కలిసి మాట్లాడారు. దాడి చేసిన యడ్ల యల్లయ్య ముఠాను తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, బాధితులు పాల్గొన్నారు.

### పాఠశాలల తనిఖీ


ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ డీఈఓ చంద్రమౌలేశ్వర్

దర్శి (కురిచేడు): ఇంటర్మీడియేట్ పరీక్షల నిర్వహణను డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వర్ సోమవారం తనిఖీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో స్టడీ అవర్స్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు మంచి లక్ష్యం ఏర్పర్చుకుని అధిక మార్కులు సాధించడమే కాకుండా నూరు శాతం ఫలితాలు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు శ్రద్ధగా బోధించాలని, సమయపాలన పాటించాలని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఎంఈఓలు రఘురామయ్య, రమాదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రెండు బైకుల ఢీ.. దంపతులకు గాయాలు


గాయపడిన నాగేశ్వరరావు

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని వేంపాడు వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని దంపతులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం రాత్రి జరిగింది. వివరాలు.. చింతలపూడి గ్రామానికి చెందిన దాసరి నాగేశ్వరరావు, అతని భార్య నాగేశ్వరమ్మలు తమ ద్విచక్ర వాహనంపై అద్దంకి వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. వేంపాడు గ్రామం వద్దకు వచ్చే సరికి ముండ్లమూరు నుంచి అద్దంకి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో నాగేశ్వరరావు, నాగేశ్వరమ్మలకు గాయాలయ్యాయి. 108కి సమాచారం అందించడంతో సిబ్బంది హరిబాబు, శ్రీనివాసరావులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### రేపు మున్సిపల్ కార్మికుల ధర్నా

మార్కాపురం టౌన్: ఆప్కాస్ రద్దును నిరసిస్తూ ఈనెల 5వ తేదీన మున్సిపల్ కార్మికుల చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ కోరారు. సోమవారం మున్సిపల్ వర్కర్స్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ ఏజెన్సీలకు మున్సిపల్ కార్మికులను అప్పజెప్పే విధానాలను మానుకోవాలని, మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత సమ్మె కాలంలో ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని కోరారు. కార్మికుల వేతనం పెంచాలని, మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బారాయుడు, హరి, సలాంఖాన్, ఇమాంసా, యూసఫ్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# మిర్చిపంటకు భగీరథ యత్నం

దొనకొండ: మిర్చి రైతులు పంటను కాపాడుకునేందుకు భగీరథ యత్నం చేస్తూ నానా అవస్థలు పడుతున్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొని గ్రామాల్లోని రైతులు మిరప సాగు చేశారు. మండలంలోని పెదన్నపాలెం, మంగినపూడి, రుద్రసముద్రం, వెంకటాపురం, భూమనపల్లి, ఇండ్లచెరువు, పుల్లాయపల్లి, పోలేపల్లి, మల్లంపేట, దేశిరెడ్డిపల్లి, రామిరెడ్డిపల్లి గ్రామాల్లో ఈ ఏడాది సుమారు 7 వేల ఎకరాల్లో మిర్చి పంటపై దృష్టి సారించినట్లు వ్యవసాయ శాఖ అంచనా. ఈ ఏడాది మంచి దిగుబడి సాధిస్తే మంచి గిట్టుబాటు ధర వస్తుందని, తమ కష్టాలు తొలగిపోతాయని మురిసిపోయిన రైతుల ఆశలు అడియాశలయ్యాయి. పంటలు సాగు చేసిన ఖరీఫ్ సీజన్ నుంచి అడపా దడపా వర్షాలకు మిర్చి పైరు కాపు దశకు పెంచారు. తీరా పంట వచ్చే సమయానికి వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొని భూగర్భ జలాలు ఇంకి నెల రోజుల నుంచి బోర్లు మొరాయించాయి. దీంతో మిరప పంటలు ఎండు ముఖం వేశాయి. కొంతమంది రైతులు ఆశలు వదులుకుని ఖాళీగా కూర్చున్నారు. మరి కొంతమంది పొలాల వద్దకు వెళ్లి చూడలేక పెట్టుబడులు సంపాదించుకుందామని ఆలోచించి నీరు సరఫరాకు భగీరథ యత్నం చేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసి మిరప పంటను కాపాడుకుంటున్నారు. పొలాలకు 2, 3 కిమీ దూరంలోని కిరాయి బోర్ల నుంచి ట్రాక్టర్‌ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ట్రాక్టర్‌కు రోజుకు రూ.1500, నీటి ట్యాంకర్ అద్దె రోజుకు రూ.400, ఒక ట్యాంక్ నీరు సరఫరా చేసిన బోరు యజమానికి రూ.100 ఖర్చు చేసి మిరప పంటను పండించుకునేందుకు రైతులు నాన అవస్థలు పడుతున్నారు. ఎకరాకు ఒక తడి నీరు సరఫరా చేయాలంటే సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేలు ఖర్చు అవుతుందని, ఇలా కనీసం నాలుగు సార్లు మిరప పంటకు సరఫరా చేస్తే కొంతమేర పెట్టుబడులు దక్కుతాయని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే క్రిమిసంహారిక, రసాయనిక, కూలీలు, నారు, పొలం దుక్కి ఖర్చు ఎకరాకు లక్ష వరకు పెట్టుబడులు అయ్యాయని రైతులు చెప్తున్నారు. ఈ ఏడాది తెగుళ్లతో దిగుబడి తగ్గింది. తీరా గుంటూరు మిర్చి యార్డులో రేటు డీలా పడిపోయిందని, ఈ ఏడాది కుటుంబాలు ఎలా జరుపుకోవాలో అర్థం కావడం లేదని రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నాలుగేళ్లుగా వరుసగా క్వింటా ధర రూ.18 వేల నుంచి రూ.22 వేల వరకు పలికింది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పట్టించుకునే నాథుడు లేక రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక మిరప ధర రూ.12 వేలు పలకటం, రైతులు డీలా పడటం, వ్యవసాయం ఇక లాభం లేదంటూ రైతన్నలు ఆవేదన చెందుతున్నారు.


ట్యాంక్ నుంచి పొలానికి నీరు పెట్టుకుంటున్న రైతులు

# ప్రొటోకాల్ గురించి తెలుసుకోండి

● కూటమి నేతల తీరుపై వైఎస్సార్ సీపీ ఆగ్రహం

పుల్లలచెరువు: ప్రొటోకాల్ గురించి తెలుసుకుని కూటమి నాయకులు మాట్లాడాలని వైఎస్సార్ సీపీ మండల నాయకులు హితవు పలికారు. ఆదివారం యర్రగొండపాలెంలో టీడీపీ నాయకులు నియోజకవర్గ శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్‌పై చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ నాయకులు ఖండించారు. వారు సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒక శాసనసభ్యుడిని విమర్శించే ముందు మాట్లాడే వ్యక్తి స్థాయి తెలుసుకుని మాట్లాడాలన్నారు. మైకు దొరికింది కదా.. అని ఇష్టానుసారంగా ఎమ్మెల్యేను మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. శాసనసభ్యుడు చంద్రశేఖర్ ప్రజా సమస్యలపై మాట్లాడితే ఎందుకు అంత ఉలుకుపాటు అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేసుకుని మాట్లాడితే ప్రజలు గమనిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో రహదారులు నిర్మించి కూటమి నాయకులు ఏదో చేసినట్లు గొప్పలు చెప్పుకోవడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. కేవలం పింఛన్ పెంచి నెల నెల పండగ చేసుకోవడం కూటమి నాయకులకే చెల్లుతోందని విమర్శించారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ఎన్నో పథకాలు పార్టీలకు అతీతంగా ఇచ్చినా ఏనాడూ గొప్పలు చెప్పుకోలేదని, నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ వాళ్లకు ఏమీ చేయకూడదన్నారంటే నాడు జగనన్న అనుకుని ఉంటే రాష్ట్రంలో పరిస్థితి మరోలా ఉండేదన్నారు. ప్రజలతో ఎన్నికైన శాసనసభ్యుడు చంద్రశేఖర్‌కు ప్రొటోకాల్ అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని. అది తెలుసుకోకుండా కూటమి నాయకులు మాట్లాడటం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని ఉపన్యాసాలు ఇస్తున్నారని, బియ్యం అక్రమదందా, ఇసుక దందా, ఇంటింటికీ మద్యం తప్ప ఏం చేశారో ప్రజలకు తెలియజేయాలన్నారు. కూటమి నాయకులు కుల ఆహంకారంతో దళిత ఎమ్మెల్యే అని చిన్న చూపుతో ఇష్టమొచ్చినట్లు నోరుపారేసుకోవడం మంచిది కాదని, ప్రజలు కూటమి నాయకులు చేసేదంతా గమనిస్తున్నారని, కేవలం సమస్యలు ఎత్తితే ఎక్కడ ఇబ్బందులకు గురిచేస్తారో అని ప్రజలు భయపడుతున్నారని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తప్పక గుణపాఠం చెబుతారని వైఎస్సార్ సీపీ నాయకులు హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఓటమి పాలయ్యాడంటే టీడీపీ పతనం ప్రారంభమైందని గుర్తు చేశారు. ప్రభుత్వం మనది, పదవి ఉంది కదా అని విర్రవీగితే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. చట్టాల గురించి కూటమి నాయకులు తెలుసుకుని మాట్లాడితే ప్రజలు స్వాగతిస్తారని, ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకుని ప్రజలతో ఎన్నుకోబడిన శాసనసభ్యుడు చంద్రశేఖర్‌ను ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యకం చేశారు. విలేకరుల సమావేశంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జానకి రఘు, సర్పంచ్‌లు తమ్మినేని సత్యనారాయణరెడ్డి, ఆవుల కోటిరెడ్డి, ఆవుల రమణారెడ్డి, ఎంపీటీసీ రాములు, సీనియర్ నాయకుడు ఉమామహేశ్వరెడ్డి, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, నాయకులు బసవిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, రవి, కోటిరెడ్డి, అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు ఇస్సాక్, గురవయ్య, లక్ష్మానాయక్, హరినాయక్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

# ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ

కురిచేడు: సచివాలయ ఉద్యోగి తన విధులు సక్రమంగా నిర్వహించడమే కాకుండా తన సొంత ఖర్చులతో వెళ్లి పింఛను పంపిణీ చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఆవులమంద సచివాలయంలో ఆహాగా పనిచేసే ఇసిరెడ్డి వెంకటేశ్వరరెడ్డికి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో డ్యూటీ వేశారు. తన విధులు సక్రమంగా నిర్వహించడమే కాకుండా తనకు కేటాయించిన వారిలో ఒక పింఛనుదారుడు పల్లె దాసు ఆరోగ్యం సరిగాలేక మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వెంకటేశ్వరరెడ్డి మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తన సొంత ఖర్చులతో వెళ్లి పింఛనుదారుడికి ఆదివారం పింఛను అందజేశాడు. వెంకటేశ్వరరెడ్డిని స్థానికులు అభినందించారు.


ఆస్పత్రిలో పింఛన్ పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

### రేపు కులవృత్తి సంఘాల నేతలతో సమావేశం

కురిచేడు: బీసీ కార్పొరేషన్ ద్వారా పనిముట్లు, ఏజెన్సీల వివరాల సేకరణ కోసం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో బుధవారం ఉదయం 11 గంటలకు కులవృత్తి సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సతీష్‌బాబు తెలిపారు. మండలంలోని అన్ని కుల వృత్తి సంఘాల నాయకులు తప్పకుండా హాజరై తగు సూచనలు, సలహాలు, ఏజెన్సీల వివరాలు తెలియజేయాలని ఆయన కోరారు.

# కమనీయం.. గోవిందుడి కళ్యాణం

మార్కాపురంటౌన్: స్థానిక జవహర్‌నగర్ కాలనీలో శ్రీదేవి భూదేవి సమేత అమలక లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో 62వ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి కళ్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా కళ్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి కళ్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాధికతోపాటు పలువురు ప్రముఖులు హాజరై కళ్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ సభ్యులు డీవీ కృష్ణారెడ్డి, జి.వెంకటరెడ్డి, వై.సత్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, యోగిరెడ్డి, మహిళా కమిటీ సభ్యులు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


అమ్మవారి తాళిబొట్లు చూపుతున్న అర్చకులు


స్వామి వారి కళ్యాణంలో పాల్గొన్న జంకె దంపతులు, తదితరులు

# వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ


నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

తాళ్లూరు: మండలంలోని దారంవారిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన ఎం. ఆంజనేయులు ఇటీవల కాలంలో పొగాక బ్యారన్ ఆకును సరి చేస్తుండగా ప్రమాదవశాస్తు గాయపడ్డాడు. ఆయన్ను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు మంచాల నారపరెడ్డి, మారం రామిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి ఎల్లప్పుడూ అన్ని విధాలుగా వారి కుటుంబాలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘ ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, వైస్ ఎంపీపీ మంచాల నాగార్జునరెడ్డి, సర్పంచ్ మంచాల వెంకటేశ్వరెడ్డి, తుమ్మిత జయరామిరెడ్డి, కైపు అశోక్ రెడ్డి, సంగు కొండారెడ్డి పాల్గొన్నారు.

# వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

దర్శి (కురిచేడు): వెలుగొండ ప్రాజెక్టుకు తక్షణమే రూ.2 వేల కోట్లు కేటాయించి పూర్తి చేయాలని సీపీఎం దర్శి మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం దర్శి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1998లో చంద్రబాబునాయుడు వెలుగొండకు రూ.980 కోట్ల అంచనాతో శంకుస్థాపన చేశారని, 28 ఏళ్లయినా పూర్తి కాలేదని విమర్శించారు. పునరావాసం లేదు, నిర్వాసితులకు నష్టపరిహారం కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి కావటానికి ఇంకా రూ.4 వేల కోట్లు అవసరమని, ఈ బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం పోరాడుతుంటే ప్రభుత్వం కంటితుడుపు చర్యగా కేవలం రూ.309 కోట్లు మాత్రమే కేటాయించారని, జిల్లా అబివృద్ధిపై ఉన్న శ్రద్ధను రుజువు చేస్తోందన్నారు. 2014లో దొనకొండలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించి దర్శి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పిన ప్రభుత్వం కనీసం మౌలిక వసతులు కల్పించలేదని ఎద్దేవా చేశారు. దర్శి నియోజకవర్గానికి అమృత్ పథకం కింద రూ.121 కోట్లు కేటాయించారని చెప్పారు. ఎర్ర చెరువును మంచినీటి చెరువుగా మార్చి ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసి పైప్‌లైన్లు మార్చి కొత్త లైన్లు వేసి ఇంటింటికీ కుళాయిలు ఇవ్వాలని కోరారు. దర్శిలో అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్ పనులు ఐదేళ్ల నుంచి ఆగిపోయాయని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య తెలిపారు. నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కనిగిరి నిమ్జ్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పటమేగానీ బడ్జెట్‌లో దాని ఊసే లేదని విమర్శించారు.జిల్లా నాయకులు తాండవ రంగారావు, ఉప్పు నారాయణ, ఎస్‌కే బాషా, జాన్ సామ్యేల్, అంజిబాబు, ఉప్పు మోహనరావు, యోహోషువా పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


నాగమ్మతల్లికి భూమిపూజ చేస్తున్న భక్తులు

దొనకొండ: స్థానిక కనకదుర్గమ్మ దేవాలయం వద్ద వెలసిన ప్రత్యక్ష నాగమ్మ తల్లి దేవాలయం పునఃనిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. యర్రబాలెం గ్రామానికి చెందిన వెంకటరమణ ధర్మపత్ని సుజాత 20 ఏళ్ల క్రితం నుంచి ఇక్కడ దేవాలయం నిర్మించాలని మొక్కుకుంటున్నారు. ఆ తల్లి అనుగ్రహంతో రూ.60 లక్షల వ్యయంతో దేవాలయం నిర్మాణానికి భూమిపూజ చేశారు. కడప జిల్లా బద్వేలుకు చెందిన వేద పండితులు హోమాలు నిర్వహించి పూజా కార్యక్రమం చేశారు. కార్యక్రమానికి ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### కిశోర బాలికకు పుట్టిన రోజు వేడుకలు


మొక్క నాటుతున్న చిన్నారులు, అంగన్‌వాడీలు

దర్శి (కురిచేడు): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో కిశోర బాలిక గౌరీ శరణ్యకు సోమవారం జన్మదిన వేడుకలు నిర్వహించారు. సిగ్నేచర్ క్యాంపెయిన్‌ను ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఎస్సీ బాలికల హాస్టల్లో బాలిక పేరుపై మామిడి మొక్కను నాటించారు. క్యాండిల్ ర్యాలీ నిర్వహించి బాలికలని పుట్టనిద్దాం, ఎదగనిద్దాం, చదవనిద్దాం.. అంటూ నినాదాలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖాదర్ మస్తాన్‌వలి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

### అభయారణ్యంలో అగ్ని ప్రమాదం

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట సమీపంలో గుండ్లకమ్మ రేంజ్ పరిధిలోని నల్లమల అభయారణ్యంలో ఆదివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. గిద్దలూరు నుంచి నంద్యాల వెళ్లే వాహనదారుల్లో గుర్తుతెలియని వ్యక్తులు అగ్గిపుల్ల వేయడం వల్ల మంటలు వ్యాపించినట్లు అటవీశాఖ అధికారులు అనుమానిస్తున్నారు. మంటలు చెలరేగిన వెంటనే అటవీశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో వన్యప్రాణులకు పెను ప్రమాదం తప్పింది.

### వన్యప్రాణులకు హాని తలపెట్టకూడదు

● ఎఫ్ఆర్ఓ, డీఆర్ఓ సూచన

మార్కాపురం: వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మార్కాపురం అటవీశాఖ ఎఫ్ఆర్ఓ వరప్రసాద్‌రావు, డీఆర్ఓ నాగరాజు పేర్కొన్నారు. వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, వివేకానంద విద్యాపీఠంలో 162 మంది విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందిస్తామని తెలిపారు. ఎఫ్‌బీఓలు రవికుమార్, బాలాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.